# ఎవరు మారాలి



చాలా రోజులయింది. మళ్ళి దానింటికి వెళ్ళేనా, వెళ్ళేనా? బావ దాన్ని ఎక్కడికీ పంపించడు. ఏదో అది పుట్టింటికి వచ్చినప్పుడు చూడవలసిందే. ఇప్పుడు వెళితే దాన్ని చూసినట్టుంటుంది. ఏమంటారు?'' అంది.

''మీ నాన్న ఉత్తరం రాశారేం? హఠాత్తుగా పుట్టింటికి ప్రయాణం పెట్టుకున్నావే. కొంపదీసి నామీద కోపంతో కాదుగదా ఈ పుట్టింటి ప్రయాణం ఏర్పాటు చేసుకున్నది?'' అన్నాడు దమ్మతుగా భుజా లెగరేస్తూ రాజశేఖరం.

''మీమీద కోపమా? ఎందుకూ?''

''అదే, నీకు జ్వరం వచ్చినప్పుడు నువ్వు ఉండ మంటున్నా వినకుండా క్లబ్బుకి వెళ్ళిపోయినందుకు.''

''కోపం, పగ మనస్సులో ఉంచుకొని సాధించగలిగే దేమీలేదు. ఏదయినా చెయ్యగలిగినా, సాధించగలిగినా అది ప్రేమ, ఆప్యాయత కూడిన అధికారాల ద్వారానే. అయినా గానీ అవన్నీ ఇప్పుడెందుకులెండి. మొన్న మా నాన్న ఉత్తరం రాశారు, ఇట్లా అక్కయ్య వచ్చిందని, నువ్వు జ్వరంపడి లేచావు కాబట్టి నీరసంతో అక్కడేం గొడవ పడతావు, వచ్చి ఓ నాలుగు రోజులుండిపొమ్మని. నేను మొన్నటినుంచీ మీకోసం చూస్తున్నాను కాస్త మీరు తీరికగా కనబడితే చెబుతామని. ఎప్పుడయినా కనబడితేనా? చెప్పండి, వెళ్లమంటారా?'' అంది శ్యామరాధిక.

''నామీద కోపం కొద్దీ వెళితే నాకు బాధగా ఉంటుంది. అదేమి లేదంటున్నావుగా. మీ అక్కయ్యను చూడాలని ఉంటే వెళ్ళు. అయినాగానీ విన్నెప్పుడయినా

"నేనేకమైనా అడ్డుపెట్టానా?" చెయ్యి కడుక్కొని, టర్కిష్ టవెల్‌తో చెయ్యి తుడుచుకొంటూ అన్నాడు రాజశేఖరం.

"మరి బెజవాడదాకావచ్చి ట్రెయినెక్కించివస్తారా? లేక నీ పనేదో నువ్వు పడు అంటారా?" పక్కపాడి అంటిస్తూ అంది శ్యామరాధిక.

"తప్పకుండా ట్రెయినెక్కించి వస్తా శ్యామా. మరీ అంత ఇదిగా తీసిపారేయ్యకు." బెడ్‌మీద పడుకొని, గుండెలదాకా దుప్పటి కప్పుకొంటూ అన్నాడు రాజశేఖరం.

మరునాడు అనుకొన్న టైముకు రాజశేఖరం రానే లేదు. పనివాడిచేత సామాన్లు పట్టించుకొని తువరువలాడుతూ బెజవాడకు వెళ్లే బస్సు ఎక్కింది శ్యామరాధిక. బెజవాడ రైల్వే స్టేషనుతో హైదరాబాదుకు వెళ్ళే ట్రెయిన్ ఎక్కింది.

చాలా రోజుల తరవాత అక్కయ్యను చూసిన సంతోషంతో రాధిక మనస్సు ఉయ్యాల ఊగింది. తల్లిదండ్రుల ఆప్యాయతలో, వాళ్ల ప్రేమలో, పరామర్శలలో రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి.

చిన్ననాటి స్నేహితురాలు హిమబిందును కలుసుకోవడానికి బయలుదేరింది శ్యామరాధిక ఓ రోజు. రిక్షాలో వెళుతూ రోడ్డు కిరువైపులా ఉన్న షాపులను చూస్తూ ఉంది. ఓ షాపులోంచి బయటికి వస్తున్న సుచరితను చూస్తూనే రాధిక రిక్షావాడిని రిక్షా ఆపమని, దిగి, "హల్లో, చరితా" అంటూ రోడ్ క్రాస్ చేసుకొంటూ పరిగెత్తింది. శ్యామరాధికను చూస్తూనే, "ఎన్నాళ్ళకెన్నాళ్ళకి, రాధీ! ఎప్పుడొచ్చావు? ఎక్కడినుంచి ఎక్కడికి వెళుతున్నావు? రాజశేఖరం కూడా వచ్చాడా?" అంటూ గడగడా ప్రశ్నల పరంపర కురిపిస్తున్న సుచరిత నోరు మూస్తూ, "ఆపవే బాబూ, నీ ప్రశ్నల పరంపర. నీ ప్రశ్నల కన్నిటికీ సమాధానాలు తరవాత ఇస్తాను. నీకుపెళ్లి అయిందని విన్నాను. శ్రీవారికి ఈ ఊళ్లోనే వేమిటి ఉద్యోగం?" అంటూ షాపు మెట్లు దిగసాగింది శ్యామరాధిక, సుచరిత చెయ్యి పట్టుకొని. శ్యామరాధిక చెయ్యిని నోటిమీదినుంచి తప్పిస్తూ, "నోరుమూస్తే ఎట్లా చెప్పనే నువ్వడిగిన వాటికి సమాధానం? నాకు పెళ్లయిన మాట నిజమే. మావారు ఉద్యోగం చెయ్యటం లేదు. చేసేది బిజినెస్. ఆయనా వచ్చారు నాతోపాటు షాపింగ్‌కి. వస్తారు ఉండు. పరిచయం చేస్తాను. మా కార్లో కూర్చుందాం రా" అంటూ కారువేపు తీసుకువెళ్లింది శ్యామరాధికను సుచరిత. రిక్షావాడికి డబ్బులు చెల్లించి కారులో కూర్చుంది శ్యామరాధిక. ఇద్దరూ కబుర్లు చెప్పుకొంటూ ఉండగా, బట్టల బిల్లు చెల్లించి సుచరిత భర్త చక్రవర్తి వచ్చాడు. ఒకళ్లనొకళ్లకు పరిచయం చేసింది సుచరిత. నమస్కార ప్రతినమస్కారాలయిన తరవాత సుచరిత వాళ్ల ఇంటికి వెళ్లారు. సాయంత్రం నాలుగింటి వరకు ఉండి ఇంటికి తిరిగి వచ్చింది శ్యామరాధిక.

'వాళ్లిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉన్నారు! ఇద్దరూ కలిసి షాపింగ్స్‌కి, పిక్నిక్‌లకి, పార్టీలకి వెళతారుట. దీపావళి వస్తే ఊళ్లో ఎక్కడచూచినా తామే ఉంటారట. వినాయకచవితి నాడు చిన్నపిల్లల్లా తామిద్దరూ కలిసి పూజ చేసుకుంటారుట. ఈ విషయాలన్నీ తనతో చెపుతున్నప్పుడు సుచీ కళ్లలో ఎంత తృప్తి! ఎంత కాంతి! సంతోషంతో మనిషి నిలువెల్లా ఊగిపోయింది. ఆయన కూడా "సుచీకి ఏమి వచ్చినా పట్టలేరండీ" అంటూ నవ్వుతూ ఎంత సరదాగా కబుర్లు చెప్పారు! ఫ్రెండ్స్ వచ్చినప్పుడు "మీ ఆయన్ని పరిచయం చెయ్యవేం? దాచుకొంటావా?" అని వాళ్లు అడుగుతూంటే తప్పుకుపోవడమో వాళ్ల ముందర ప్రదర్శనకు పెట్టగలిగింది కానీ వేరే మరేమీ చెయ్యలేకపోయింది. ఇరవై నాలుగు గంటలూ తన ముందరే ఉండాలని తను కోరుకోవటం లేదుగా! కనీసం రోజులో ఒక్క గంటయినా తనతో సరదాగా గడపకూడదా? తానేం మహాపాపం చేసిందని ఈయనకి పెళ్లాం, ఇల్లు పట్టకుండా పోతున్నాయి? తన స్నేహితులు వచ్చినప్పుడు మాత్రం పన్ను ఎక్కడున్నా బిరబిరా లాక్కుంటూ తీసుకువెళ్లి "నా వైఫ్. శ్యామరాధిక, బి. ఎ." అంటూ గర్వంగా, జాటులకాలు వేసిమీద అంటంగా ఊగిస్తూ పరిచయం చేస్తాడు. నాకు కూడా నా ఫ్రెండ్స్‌కి ఆయన్ని అట్లాగే పరిచయం చెయ్యాలని ఉండదా? ఏం మనిషీయన?' అనుకుంటూ సుచరిత ఇంటినుంచి వచ్చిన శ్యామరాధికకు మనస్సు మనసులో లేదు. మనసు ఓ విధమైన అసూయతో అల్లాడ సాగింది. ఈ బాధనుండి తప్పించుకోవడానికి, మరిచిపోవడానికి స్నేహితురాళ్ల ఇళ్లకు పిచ్చిదానిలా నిమిషం పాటు ఇంట్లో ఉండకుండా తిరగసాగింది శ్యామరాధిక.

ఓ వారం రోజులు గడిచిన తరవాత సుచరిత శ్యామరాధిక వాళ్ల ఇంటికి వచ్చింది. ఇద్దరూ బాల్కనీలో చంబేలీ పువ్వుల తీగె పక్కన కుర్చీలు వేసుకొని కూర్చొని కబుర్లలోకి దిగారు. కాలేజీ చదువులు, లెక్చరర్ల నేడిపించడం, లెక్చరర్ల కొంటె పేరులు, కొత్తగా కాలేజీ ముఖాలు చూసినవాళ్లని ఏడిపించడం—ఇవన్నీ ధారావాహినిగా వాళ్ల మాటల్లో దొర్లిపోతున్నాయి. శ్యామరాధిక, రాజశేఖరాలు ప్రేమించుకోవడం, వాళ్ల పెళ్లి ఇవికూడా వాళ్ల మాటల్లోకి వచ్చాయి.

"అవునుగానీ, రాధీ! మరి మీ దాంపత్యం ఎట్లా ఉందో చెప్పవేమే? మొన్న అయితే నా నోటివెంట అన్ని విషయాలూ లాగావు. మీరు ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారుగా. మీరిద్దరు, మేమందరం ఊహిస్తున్నట్టు చాలా అన్యోన్యంగా ఉండిఉండచ్చు. మీరిద్దరూ కలిసి ఈ మూడేళ్లలో ఏయే ఊళ్లు చూశారే? మీ ఆయనకి నాగార్జున సాగర్‌లో కదూ ఉద్యోగం? అక్కడికి దగ్గర్లోనే మంగళగిరి పానకాలస్వామి, శిల్పకళకి ప్రసిద్ధికెక్కిన అమరావతీ ఉన్నాయిగా. అవన్నీ చూశావటే? ఈసారి అమరావతి చూడడానికి ప్లాను వేసుకుంటున్నాం మేము. ఏ ప్రదేశమయినా చూడడానికి దాన్ని గురించిన వివరాలు, విశేషాలు ముందరే తెలుసుకోవడం నా హాబీ అని నీకు తెలుసు. ఇంక చెప్పు. అజంతా, ఎల్లోరాలలో శిల్పాలకి, అమరావతి శిల్పాలకి గల తేడా ఏమిటి? అమరావతీ శిల్పాల్లో గల ప్రత్యేకత ఏమిటి? పానకాలస్వామి పానకం సగం మాత్రమే తాగి మిగతా సగం కక్కేయడంలో గల కిటుకేమిటి?"

రోషంతో, అవమానంతో, దుఃఖం పొంగుకు రాబోతున్న శ్యామరాధిక అంది: "ఆ చూశాను అన్ని ప్రదేశాలు. తిరగని ఊరూ లేదు, చూడని ప్రదేశమూ లేదు, మా ఇంటి నాలుగు గోడల మధ్యలో, నా కలల్లో. అమరావతిని గురించేం ఖర్మ. లాస్ ఏంజల్స్ విశేషాలు



ఒంటరి బ్రతుకు

చిత్రం—వి. శశి (పేకేట్టిపాలెం)

కూడా చెబుతాను.''

"అదేమిటే అంత కోపం వచ్చింది? కళ్లలో ఈ నీళ్లేమిటి? మొహం అంత ఎర్రగా చేసుకున్నావేమిటి? నేనన్నదాంట్లో తప్పేముంది? కొంపదీసి మీ ఇద్దరికీ పడడం లేదేమిటి? నాకు తెలిసినంతలో రాజశేఖరం మంచివాడేనే! ఏమిటే తల్లీ నీ బాధ?'' అంది సుచరిత.

ఇంక ఉండబట్టలేకపోయింది శ్యామరాధిక. "ఏం చెప్పమంటావు, చరితా. ఆయనకి పేకాట, ఆడటానికి స్నేహితులు ఉంటే చాలు. ఇల్లు, పెళ్లాం, నావాళ్లను కొనేవాళ్లు ఏమయిపోయినా సరే, ఆ పేకాట వదిలి రారు. ఒక్కదాన్నీ ఇంట్లో బిక్కు బిక్కుమంటూ చస్తున్నాను. రోజులో ఒక్క గంటయినా సరదాగా నాతో గడపరు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి పొందుతున్న ప్రాంతాలు ఎట్లా ఉంటాయో నీకు తెలియంది కాదు. క్లబ్బులకి పోవడం నాకు ఇష్టం లేదని నీకు తెలియంది కాదు. రోజస్తమానం నా దగ్గిరే ఉండమని నేను కోరడం లేదు కదా ఆయన్ని! ఆఫీసునుంచి వస్తూనే ఆదరా బాదరా టిఫిన్ తిని వెళ్లిపోయినాయన రాత్రి పదకొండు, పన్నెండు గంటలకిగానీ ఇంటిమొహం చూడకుండా ఉంటే మనస్సు ఎంత బాధపడుతుందో ఆలోచించు. ఒక్కొక్కసారి ఇంటికి టిఫినుకి కూడా రారు. కొన్ని కొన్ని రాత్రుళ్లు క్లబ్బులోనే ఉండిపోతారు. ఒక్క సరదా లేదు, పాడూ లేదు.''

ఆ పైన తనకు జ్వరం రావడం, రాజశేఖరాన్ని ఒక్క రోజు ఇంట్లో ఉండమని ప్రతిమాలడం, రాజశేఖరం ఇంట్లో ఉండకుండా క్లబ్బుకు వెళ్లిపోవడం అన్నీ చెప్పింది.

"ఓహ్! నీకూ వచ్చిందిటే ఈ కష్టం. ఇప్పుడంటే మా ఆయన నాతో సరదాగా తిరుగుతున్నారు గానీ, ఇది వరకు ఇంటిమొహం చూసేవారనుకున్నావేమిటి? ఎంత సేపటికీ స్నేహితులు, వాళ్లతో తిరుగుళ్లు. ఈయనకి బ్రహ్మచారి వాజమ్మలు సవాలక్షమంది స్నేహితులు ఉన్నారు. వాళ్లకేం తెలుస్తుంది ఒక్క నిమిషమయినా మగవాళ్లని ఇంట్లో ఉండనీకుండా తమ వెంట తిప్పితే పెళ్లాలేడుస్తారనీ, తమని తిడతారనీను?—మావారు చేసేది వ్యాపారమని నీకు తెలుసు కదా! మా మేనేజరు మంచివాడు కాబట్టిగానీ లేకపోతే మేము ఈపాటికి బొచ్చె చేతపట్టుకొని ఇల్లిల్లూ తిరగవలసి వచ్చేది. 'నువ్వు సక్రమంగా ఆఫీసుకు రావడంలేదే' మని అజమాయిషీ చేసే ఆఫీసర్లు ఎవరూ లేరు. ఇంకేం! ఇష్టం వచ్చినంతసేపు తిరిగేవారు. వీధి వాకిట్లోంచే 'సుచీ, సుచీ' అంటూ అరుస్తూ వచ్చేవారు. పరిగెత్తుకొంటూ వెళ్లి టై, బూట్లు విప్పి, టవెల్ అందించి, రోడ్డు రోలరులా దొర్లుకుంటూ వెళ్లి వేడినీళ్లు తోడి టవెల్ అవీ బాత్‌రూంలో పెడితే రెండు చెంబుల నీళ్లు ఒంటిమీద పోసుకువచ్చేవారు. ఈ లోపల నేను మరో పాంటు, షర్టు, టై తీసి అట్టే పెట్టెయ్యాలి. దానికి తగ్గ బూట్లూ అవీ పాలిష్ చెయ్యకుండా ఉంటే పాలిష్‌చేసి రెడీగా ఉంచాలి. ఆయన బట్టలు వేసుకునేలోపల టిఫినయితే టిఫినూ, భోజనమయితే భోజనం తెచ్చి టేబుల్‌మీద అమిర్చేసెయ్యాలి. ఆదరాబాదరాగా అవతలేవో కొంప అంటుకుపోతున్నట్టు తినేసేవారు. గబగబా తల దువ్వేసుకొని వీధిలో పడ్డారంటే మళ్లా ఎప్పటికో దర్శనం. ఆ కాస్సేపట్లోనే ఆయన స్నేహితులు వచ్చి కూర్చునేవారు, నేనేం మాయ చేసి ఆయన్ని ఇంట్లో ఉంచేస్తానోనని. పండగనీ లేదు, పబ్బమనీ లేదు ఎప్పుడూ తిరగడమే పని. అప్పటి రోజుల్లో మీరిద్దరూ నాకు తరుచూ గుర్తుకు వచ్చేవారు. పెళ్లి కాకముందు మీరిద్దరూ కలిసి ప్రతి ఆదివారం గోలకొండ, చార్‌మినారు, గండిపేట ఇవన్నీ తిరిగి వచ్చేవారు కదూ! సెలవుల్లో మీ అన్నయ్య, అక్కయ్య, నువ్వు, రాజశేఖరం—మీరందరూ కలిసి [illegible] ఊళ్లు చూసి వచ్చేవాళ్లుగా. పెళ్లి అయిన తరవాత ఇంకెంత సరదాగా ఉన్నారో అనుకొనేదాన్ని. [illegible] చూసిచూసి విసుగెత్తింది. ఇది కాదు పని అనుకొని ఒకరోజు ఆయనతో చెప్పాను నేను క్లబ్బులో మెంబరవ్వు తున్నానని. 'ఓహ్! రియల్లీ! గ్లాడ్ టు నో, సుచీ' అంటూ ఇల్లెగిరిపోయేట్టు అరిచారు. 'ఇప్పుడు మీకు గ్లాడ్‌టు నో యేం లెండి' అని మనసులో అనుకొని క్లబ్బులో చేరాను. క్లబ్బులో చేరి మెంబర్స్‌తో పరిచయం స్నేహం చేసుకున్నాను. పార్టీలు, పిక్నిక్‌లు, క్లబ్ వార్షికోత్సవాలు, వార్‌ఫండ్‌లు అంటూ ఇల్లు పట్టకుండా తిరగసాగాను. సమయానికి తనకి కావలిసినవి అందకుండా పోయేసరికి అబ్బాయిగారికి బుర్ర తిరగసాగింది. నేను క్లబ్బులో చేరుతున్నానని తెలిసినపుడు నన్ను ప్రోత్సహించి సందుకుగాను తను బాధపడుతున్నా [illegible] మొహమాటానికి ఊరుకొన్నారు. [illegible] 'క్లబ్బుకి వెళ్లుగానీ, సుచీ, మరీ ఇంత ఇదిగా ఇంట్లో ఉండకుండా తిరక్కు. మొన్నటికి మొన్న వంటమనిషి కూరలో కారం ఎంత ఎక్కువ వేసిందంటే ఇంక కూర వేసుకోవాలంటే భయం పుట్టేట్టు చేసింది. నేను వచ్చేసరికల్లా టిఫిన్ తయారుచేసి ఉంచమంటే తయారుచేసి అట్టే పెట్టలేదు. నేనెంత బాధపడ్డానో నువ్వాలోచించు' అంటూ మొదలు పెట్టారు. 'స్నేహం విలువ తెలిసిన మీరేనా ఈ మాటలనేది! స్నేహితులకోసం కాకపోయినా మీకోసమైనా కొంచెం ఈ పార్టీలూ అవీ తగ్గించుకుందామనుకుంటే స్నేహితురాళ్లు నన్ను వదలటం లేదు. అయినాగానీ పిక్నిక్‌లూ, పార్టీలూ తెలియని బ్రతుకేమిటి? మీరు వంటమనిషికి కొంచెం నయంగా చెప్పి చేయించుకోండి. నేనూ ఇవాళ దాన్ని కేకలేస్తాను. వనజతో నాలుగు గంటలకి వస్తానని చెప్పాను. నాలుగు కావస్తూంది. వెళ్లాలి' అంటూ ఆయన ఇదివరకన్న మాటలు ఆయనకే అప్పగిస్తూ వెళ్లిపోయేదాన్ని. దానితో పెద్దమనిషి మారారు మనిషి.

"అనుభవాన్ని మించిన గుణపాఠం వేరే లేదు. స్నేహితులు, క్లబ్బులు కావలిసినవే. కానీ వాటికి హద్దు అనేది ఉండాలిగా! ఆయన ఇప్పుడు కూడా క్లబ్బులకి వెళతారు. స్నేహితులతో పిక్నిక్‌లకి, పార్టీలకి వెళతారు. కానీ ఇది వరకంతటి అన్యాయం కాదు. ఆయన షికార్లలో, సరదాలలో ఇప్పుడు నేనూ పాలు పంచుకుంటున్నాను. ఈ మగవాళ్లంతా ఒకటే పద్ధతి. వీళ్లని మార్చాలంటే వీళ్లు చేసే పనులే మనమూ చెయ్యాలి. అదే వీళ్లకి తగిన గుణపాఠం'' అంటూ తన సొద వెళ్లబోసింది సుచరిత. "నీ కిష్టం లేకపోయినా సరే, మీ ఊళ్లో ఉన్న క్లబ్బులో చేరు. మీ ఆయన తోటి ఆఫీసర్ల భార్యామణులతో పరిచయం చేసుకో. ఇల్లు అనే రెండక్షరాలు తెలియనట్టే తిరుగు. దానితో దారికి వస్తాడు రాజశేఖరం'' అని సలహా ఇచ్చింది.

"తప్పకుండా నీ సలహా పాటిస్తా, చరితా. నావారు అనుకున్నవారు ఒక్క రోజయినా నాతో సరదాగా గడపకపోతే నేను భరించలేను'' అంది శ్యామరాధిక.

సుచరిత సలహా విన్న శ్యామరాధికకు హైదరాబాదులో ఇంక ఒక్క నిమిషం కూడా ఉండ బుద్ధి పుట్టలేదు. పెట్టె, బెడ్డింగ్ సర్దివెయ్యటం మొదలుపెట్టింది.

## సత్తెప్పెమా నంగ

### పురుషోత్తంరావు

సత్తెప్పెమానంగ
సెప్పుకుంటినే పిల్ల,
సిత్తమేసి నువ్వు
సెవిమెత్తి నట్టురుకు!

కన్నెత్తి నావంక
సల్లంగ నువ్వు సూత్తె
వొళ్ళంత నొకసారి
ఝల్లుమని పొంగెను.

[illegible] నువ్వు
[illegible] రువ్వు!
[illegible] నీలో నేను
[illegible]!

[illegible] నువ్వు
తలుసుకుని తలుసుకుని
కమ్మగా నా గుండె
[illegible].

ఇసురుగా నాకేసి
[illegible] సూసి,
నవ్వుకుంటే నువ్వు,
ఉసురోసుకుంటాళ్ళు.

సత్తెప్పెమానంగ
సెప్పుకుంటినే పిల్ల,
సిత్తమేసి నువ్వు
సెవిమెత్తి నట్టురుకు! *

"దసరా దగ్గిర పడిపోయింది. దసరా దాటిన ఇరవై రోజుల్లో దీపావళి రానే వస్తూంది. ఇప్పుడెందుకేం అమ్మాయీ, ఈ ప్రయాణం? అల్లుడికి ఉత్తరం రాసి పడేస్తాను, ఓ నెల రోజులు సెలవు పెట్టి రమ్మని. ఇప్పుడాపివెయ్యమ్మా ఈ ప్రయాణం'' అంటూ తల్లి దండ్రీ నచ్చజెప్పారు శ్యామరాధికకు. "దసరా ఇంకా ఇరవై

(తరువాయి 39 వ పేజీలో)

# ఎవరు మారాలి!

## (37 వ పేజీ తరువాయి)

రోజులుంది. దానికి ఇంకా ఇరవై రోజులుంది దీపావళి. లేదు, నాన్నా, నేను వెళ్ళిపోతాను. దీపావళినాటికి ఇద్దరం కలిసి వస్తాము'' అన్నది ఆమె.

రాజశేఖరానికి టెలిగ్రాం ఇచ్చింది శ్యామరాధిక తనను బెజవాడ స్టేషనులో కలుసుకోవలిసిందని. స్నేహితురాలికి వీడ్కోలు ఇవ్వటానికి సుచరిత వచ్చింది. ''ఎప్పుడూ ఇల్లు, ఇంటి విషయం ఆలోచించే మనకి ఇల్లు పట్టకుండా తిరగడమనేది మొదట్లో కష్టంగానే ఉంటుం దనుకో. మనం ఇట్లా తిరుగుతున్నది ఒక లక్ష్యం కోసమని గుర్తు ఉన్నప్పుడు అంత బాధ కలగదు. నీవు మాత్రం కూడా బెంబేలుగా ఉండకు. రాజశేఖరం ఎంత గోలచేసినా పేచీపెట్టినా వినకు. తరవాత తనే మారతాడు నెమ్మదిగా. జరిగిన సంగతులన్నీ నాకు ఉత్తరంలో రాస్తావుగా. నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తుంటాను. రాబోయే దీపావళి నాటికి జగత్తుకే కాదు మీ జీవితాలలో కూడా దివ్యజ్యోతులు, ఆనంద జ్యోతులు వెలగాలని ఆశిస్తున్నాను. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్, డియర్'' అంది సుచరిత.

ట్రెయిన్ కదిలింది. రుమాలు ఊపుతున్న శ్యామరాధిక చెయ్యి క్రమక్రమంగా అదృశ్యం కాసాగింది సుచరిత కంటికి.

* * *

కన్నెపిల్లల బొమ్మల కొలువులతో, పిల్లలు, పెద్దలు జమ్మిచెట్టు దగ్గిరికి వెళ్ళి పూజించి తెచ్చిన బంగారమనబడే జమ్మి, మామిడి ఆకులతో దసరా కోలాహలంగా, ఆనందంగా కదిలి పోయింది. దివ్యజ్యోతుల దీపావళి దగ్గిరికి వస్తోంది. పిల్లలు టపాకాయలు కొనేసి ఎండలో ఎండపెడుతున్నారు దీపావళినాడు బాగా పేలాలని. ఆడవాళ్ళు దీపావళినాడు చెయ్యవలిసిన పిండి వంటలను గురించి ఆలోచించుకుంటున్నారు. మగవాళ్ళు పిల్లలకు కొనవలిసిన బట్టల హడావిడిలో ఉన్నారు.

దీపావళి వచ్చింది. మానవాళిపై వింత వెలుగు చిలికించింది. పిల్లల బాణ సంచా కాల్పులతో, కోలాహలంతో సాగిపోయింది దీపావళి.

దీపావళి వెళ్ళిన రెండు రోజులకు సుచరితకు ఒక ఉత్తరం వచ్చింది. కవరుపైన శ్యామరాధిక దస్తూరీ చూస్తూనే సుచరిత కవరు ఆత్రతతో విప్పింది.

''డియర్ సుచీ,

నీకు మాట ఇచ్చిన ప్రకారం ఇక్కడికి నేను వచ్చిన తరవాత జరిగిన విషయాలన్నీ వ్రాస్తున్నాను.

నన్ను బెజవాడ స్టేషనులో కలుసుకోవలిసిందంటూ ఆయనకు నే నిచ్చిన టెలిగ్రాం విషయం నీకు తెలుసు. ఆయన నన్ను బెజవాడ రైల్వేస్టేషనులో నేననుకున్నట్టుగానే కలుసుకోలేదు. అక్కడినుంచి నాగార్జునసాగర్ బస్సు ఎక్కి నాగార్జునసాగర్‌లో దిగి ఇంటికివెళ్ళేసరికి నవ్వులతో, ఇస్పేటు ఆసులు, మదాన్ రాణులంటూ కేకలతో ఇంటి కప్పు మరో రెండు నిమిషాలలో కూలిపోతుందన్నంత గొడవగా ఉంది. లోపలికి వెళ్ళి శ్రీవారికి కబురుచేశాను నేను వచ్చానని, నౌకరు ద్వారా. వాడిద్వారా తిరిగి నేనందుకొన్న సమాధానం త్వరగా కాఫీ, టిఫిన్ తయారుచేయించి పంపించమని. అప్పటికి ఆయన కోరినవి తయారుచేయించి పంపించి పని మనిషి సాయంతో చిందర వందరగా ఉన్న ఇల్లు సర్దుకొన్నాను.

ఓ రెండు రోజులు ఆగి ఆయనికి చెప్పాను నేను క్లబ్బులో చేరబోతున్నానని. ఆయన అంతగా హర్షించ లేదు. అట్లా అని అడ్డుపెట్టనూ లేదు. క్లబ్బులో మెంబరయ్యాను. మెంబర్లతో స్నేహాన్ని బాగా వృద్ధి చేసుకొన్నాను. 'ఈ చీర ఎంతకి కొన్నారండి? మీ మెళ్ళో ఉన్న రాళ్ల అడ్డిక ఎక్కడ చేయించారు? ఎన్ని వందలయింది? మీ వారి జీతమెంత? మీ కెంతమాత్రం ఆస్తిపాస్తులున్నాయి?' మెంబర్స్ వేసే ఇట్లాంటి ప్రశ్నలన్నీ భరించాను. ఎప్పుడయినా వాళ్ల మాటలకు కోపం వచ్చినా వెంటనే గుర్తుకు తెచ్చుకొనేదాన్ని, ఆయన మారడంకోసం నేను క్లబ్బులో చేరానని. అందువల్ల సహించుకొనేదాన్ని.

ఆయన ఏమాత్రం మారారని రోజూ పరిశీలన చేసే దాన్ని. ఆశించినంత మార్పు ఆయనలో నాకు కనపడేది కాదు.

అసలే నెలా పదిహేను రోజులు అక్కడ ఉండి వచ్చాను. ఇక్కడికి వచ్చిన తరవాత కూడా ఆయన అవసరాలు తీర్చకుండా, తిండి విషయం చూడకుండా తిరుగుతూ ఉండటం మూలంగా ఆయన జబ్బు పడ్డారు.

ఆ రోజు నేను ఓ స్నేహితురాలు కలిసి, సినిమాకి వెళ్లాము. నేను ఇంటికి వచ్చిన గంటకి ఆయన వచ్చారు. వంట మనిషి చేసి పడేసిన చల్లబడిన అన్నం తప్పదు కనక ఇద్దరికీ వడ్డిస్తున్నాను. 'నాకు ఒంట్లో ఎట్లాగో ఉంది, శ్యామూ. నాకు వద్దు అన్నం. అబ్బ! తల పగిలిపోతూంది' అంటూ బెడ్‌రూమ్ వైపు వెళ్లిపోయారు. నా గుండె గతుక్కు మంది. చెయ్యి కడుక్కుని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళేసరికి ఆయన బెడ్‌మీద పడుకొని ఉన్నారు. ఒళ్ళు పట్టుకొని చూస్తే పేలిపోతూంది. రెండు రోజులు ఆయనకి ఒళ్ళు తెలియ లేదు. ఆ రెండు రోజులు నేను క్లబ్బుకి వెళ్లటం మానేశాను. క్లబ్బుకి వెళ్లకూడ దనుకున్నాను. కానీ నువ్వు అన్నావు బెంబేలుగా ఉండకూడదని. మనస్సు గిలగిల లాడింది, చరితా, క్లబ్బుకి వెళ్లాలంటే. నాలోని సర్వశక్తులూ వ్యతిరేకించాయి వెళ్లద్దని. కానీ నేను క్లబ్బుకి వెళ్లడం మొదలుపెట్టాను మూడో రోజు నుంచీ. క్లబ్ వార్షికోత్సవ సందర్భంలో ఏర్పాటు చేసిన విందు ఆరగించి ఇంటికి వచ్చాను.

ఆయనలో మార్పు ఆయనకి జ్వరం వచ్చినప్పటి నుంచీ మొదలయింది. నన్ను ఇంట్లో ఉండిపొమ్మని గొడవ చెయ్యడం మొదలు పెట్టారు. 'నీకు జ్వరం



సిద్ధి వినాయకమూర్తి
కత్తిరింపు చిత్రం—అక్కోజు కృష్ణారావు
(కొరప్రోలు)

వచ్చినప్పుడు నువ్వెంత బాధపడ్డావో ఇప్పుడు నాకు అనుభవపూర్వకంగా తెలిసి వచ్చింది, శ్యామూ. బొత్తిగా పేకాట, స్నేహితులు లేకుండా ఉంటానని మాట ఇవ్వ లేనుగానీ ఇదివరకటంతటి విపరీతంగా పేకాట ఆడను. నువ్వు నా దగ్గిరే ఉండు, శ్యామూ. నీ కళ్లలోకి నన్ను చూడనీ. నీ మాటల్లో, నీ సేవల్లో గల ఆప్యాయత నన్నర్థంచేసుకోనీ. నాకు ఆరోగ్యం కుదుటపడిన తరవాత క్లబ్బుకు వెళుదువుగాని. నేను నిన్ను అడ్డు పెట్టను' అంటూ మొదలెట్టారు ఒక రోజు నేను బయలుదేరుతూండగా. చరితా! అప్పుడు నాకు ఎంత సంతోషం కలిగిందనుకున్నావ్! పరిగెత్తుకొంటూ వెళ్లి పసి పిల్లాడిలా మాట్లాడుతున్న ఆయన్ని గుండెలకి హత్తుకోవాలనిపించింది. చెదురుమదురుగా ఉన్న ఉంగరాలజుట్టు నిండు మనస్సుతో పైకి ఎగదోస్తూ ఆయన పక్కనే కూర్చుని తరగని కబుర్లు చెప్పాలనిపించింది. కానీ మళ్లీ నీ మాట గుర్తుకు రావడంతో ఆగిపోయాను. ఆయన వైపు తిరిగితే ఎక్కడ బింకం సడలిపోతుందోనని 'అబ్బ! ఎట్లాగండీ. నా ఫ్రెండ్సు అందరూ బి.సి. కాలం నాటి మనిషివి అంటూ వెక్కిరిస్తారు, ఇంట్లో ఉండిపోతే. మొన్నటికి మొన్న మంజుభాషిణి అనే ఆవిడ భర్తకి ఒంట్లో బాగా సుస్తీగా ఉన్నప్పటికీ క్లబ్బుకి వచ్చేసింది. (అంతా ఉత్తది. మంజుభాషిణి అనబడే ఆవిడ మా మెంబర్స్‌లో లేదు.) వెంకమ్మ ఉండనే ఉంది మీకన్నీ అమర్చిపెట్టడానికి. ఎటుతిరిగీ రెండు గంటల్లో నే నింటికి రానె వస్తాను' అని గబగబా బయటికి వెళ్ళి పోయాను. క్లబ్బుకి వెళ్ళిన తరవాత మనసు ఉండబట్ట లేక పోయింది. 'ఆయన మారారు. మారారని తెలిసిన తరవాత కూడా మొండిగా నేను క్లబ్బుకి రావటం బాగా లేదు. నా ఈ మొండితనం ఆయన మనసు విరిచి లేని పోని గొడవలు తెచ్చి పెట్టచ్చు' అనుకున్నాను. పార్టీ అవక మునుపే ఇంటికి వచ్చేశాను. ఆయన మగతగా







# ఎవరు మారాలి!

నిద్రపోతున్నారు. ఆదో విధమైన అమాయికత్వంతో ఉన్న ఆయన మొహం చూస్తుంటే నాకదోలా అయిపోయింది. నుదుటిమీది ఉంగరాల జుట్టు చెల్లాచెదురుగా పడి ఉంది. మెల్లిగా జుట్టు సరిచేస్తుంటే నా చేతి స్పర్శకి, గాజుల గలగలల శబ్దానికి ఆయన లేచారు. నా ఒళ్ళో తలపెట్టుకుని నా కళ్ళలోకి చూస్తూ నిద్రపోయారు. తెలియని తృప్తి ఏదో నన్ను నిలువెల్లా పులకితురాల్ని చేసింది. ఆటు తరవాత క్లబ్బుకి వెళ్లడం మానేశాను. క్రమక్రమంగా ఆయన ఆరోగ్యం కుదుట పడింది. పథ్యం పెట్టాను. డాక్టర్‌కి బిల్ ఇచ్చేటప్పుడు ఆయన అన్నారు: 'నేనిచ్చిన మందు అదేం లెక్కమ్మా. నువ్వు చేసిన సేవ చెప్పుకోవాలి గానీ.' ఆ మాటలు నాలో సంతోష తరంగాలు లేపాయి.

పథ్యం పెట్టిన తరవాత ఆయన స్నేహితులు వచ్చేవారు పేకాటాడదామని. కానీ ఆయన వాళ్లందర్నీ తిరగగొట్టేశారు. దీపావళి రెండు రోజులు ఉందన్న నాటికి ఆయనకి బాగా ఆరోగ్యం చిక్కింది.

ఆ రెండు రోజులు కాలు గాలిన పిల్లిలా ఇంట్లో తిరిగారు. కబుర్లు చెబుతూ చెబుతూనే పరధ్యానంలో పడేవారు. కొత్త కదా పేకాట లేకుండా ఉండటం, మెల్లిగా అలవాటు పడతారు అనుకున్నాను.

ఇవ్వాళ దీపావళి. మానవాళికి వింత వెలుగుతెచ్చే దీపావళి. నరకాసురుణ్ణి చంపడంలో శ్రీకృష్ణునికి సహాయపడి చివరికి తన చేతిలోనే నరకాసురుడికి అంతం కలిగించి ఆనాటి ప్రజల మనస్సులకే కాదు ఇంటింటికీ, ముందు తరాలవారికి సత్యభామ ప్రసాదించిన దివ్య జ్యోతిర్మాల.

తెల్లవారుఝామున ఆయన్ని బలవంతానలేపి సంప్రదాయం ప్రకారం ఆయన టపాకాయలు కాల్చివచ్చిన తరవాత హారతి ఇచ్చి తలంటి పోశాను. పది గంటలకల్లా మేమిద్దరం భోజనంచేశాం. భోజనంచేసిన తరవాత ఆయన అలా బయటకు వెళ్లి వస్తానన్నారు. సాయంత్రం ఆరయినా ఆయన అజ లేదు. ఇంటిని రంగురంగుల దీపాల తోరణాలతో అలంకరించాను. కొత్త బట్టలు కట్టుకొని ఆయనకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. చూసిచూసి విసుగెత్తి నౌకర్ని పంపించాను ఆయన ఎక్కడున్నారో కనుక్కోమని. వాడు వార్త మోసుకుని వచ్చాడు పొద్దున్న పది గంటలనుంచీ రామ్మూర్తిగారింట్లో పేకాటాడుతున్నారనీ, మరో మూడు ఆటలయ్యేవరకు ఇంటికి రానన్నారనీను. చరితా! నా కనిపిస్తోంది ఆయన ధోరణి మారదని. పదిమంది పిల్లలు పుట్టి బాధ్యతలు బాగా నెత్తిన బడ్డ తరవాత అప్పుడు—అప్పుడు మారతారేమో! ఇంక మిగిలిందల్లా నేను మారడం. అవును, నేనే మారతాను. ఆయన మరీ అంత చెయ్యకూడని తప్పు చెయ్యడంలేదుగా. నే నెందుకు మథన పడాలి ఈ విషయానికి? దివ్యజ్యోతుల దీపావళి మార్చింది ఆయన్ని కాదు, నన్ను. ఎవరు మారారు? అన్న ప్రశ్నకి సమాధానంగా నేనే నిలుస్తున్నాను.

నీ
శ్యామరాధిక." ★